జనవరి 2004.

ఆర్టికల్ చదివి తల ఎత్తాడు 'ది విచితా ఈగిల్' సంపాదకుడు.

ఆశగా తనవైపే చూస్తున్న వ్యాస రచయిత కనిపించాడు.

నవ్వుకున్నాడు సంపాదకుడు. రచయితలు చిత్రమైన మనుషులు. తాము రాసిన ప్రతీదీ కళాఖండం అనుకుంటారు. తాము రాసిన దాన్ని చదివి ప్రజలు పిచ్చివాళ్లయి పోతారనుకుంటారు. ప్రజలు తమకు నీరాజనాలు పడతారనుకుంటారు. కానీ ఎవ్వరూ వారి రచనలను పట్టించుకోరు. నిరాశ పడతారు. అంతటితో ఆగిపోతే వాళ్లు రచయితలే కారు.

వారంలో ప్రపంచాన్ని కదిలించే మరో రచనను పట్టుకొస్తారు. మళ్లీ కథ మొదలు.

# మనిషై పుట్టిన మృగం

## రియల్ స్టోరీ

**కస్తూరి మురళీకృష్ణ**

'ఎలా ఉంది?' ఆత్రంగా అడిగాడు. నవ్వాడు సంపాదకుడు.

'టైమ్లీగా ఉంది. ఓటెరో హత్యలు జరిగి 30 ఏళ్లయిన సందర్భంగా ఈ వ్యాసం ప్రచురించవచ్చు. ముప్పై ఏళ్ళయిందా ఈ హత్యలు జరిగి? ముప్పై ఏళ్లయినా హంతకుడు ఇంకా దొరకలేదు. బాగుంది...' అన్నాడు సంపాదకుడు.

రచయిత పొంగిపోయాడు. భవిష్యత్తులో ఇంకా తాను ఏయే వ్యాసాలు రాయాలనుకుంటున్నాడో ఏకరువు పెట్టటం ఆరంభించాడు. అన్యమనస్కంగా వింటూ నవ్వుకున్నాడు సంపాదకుడు. 'రచయితలు చిన్నపిల్లల్లాంటి వాళ్లు. కొంచెం పొడిగితే చాలు పొంగిపోతారు' అనుకున్నాడు, రచయిత భవిష్యత్తులో రాయబోయే రచనల ప్రకటనను ఎక్కడ ఆపాలా అని ఆలోచిస్తూ! అయితే, ఆ క్షణంలో అతడు ఊహించలేదు. ఆయన ప్రచురించబోయే ఆ వ్యాసం 30 ఏళ్లుగా తేలని హత్యల చిక్కుముడి విప్పబోతోందని!

* * *

ఓటెరో హత్యలు జనవరి 15, 1974 నుంచి ఆరంభమయ్యాయి. ఎయిర్‌ఫోర్స్‌లో 20 ఏళ్లు పనిచేసిన జోసెఫ్ ఓటెరో, తన భార్య పిల్లలతో, విచియా వచ్చాడు. ఆ ఊళ్లో స్థిరపడ్డాడు. చుట్టుపక్కల వారందరితో ఫ్రెండ్లీగా ఉండేవాడు. మంచిపేరు సంపాదించాడు. ఓ రోజు పిల్లలు స్కూళ్లకు వెళ్లిపోయిన తరువాత భార్యాభర్తలిద్దరూ బయటకు వెళ్లేందుకు తయారవుతున్నారు. జోసెఫ్ స్నానం చేసి బయటకు వచ్చేసరికి భార్య కట్టేసి ఉంది. ఆశ్చర్యపోయిన జోసెఫ్‌పై దొంగ వెనుకనుండి దాడిచేశాడు. గడియారాలు, కీ చైన్లు తీసుకున్నాడు. స్కూలునుండి పిల్లలు ఇంటికి వచ్చేవరకూ హత్య విషయం ఎవరికీ తెలియదు. ఈ హత్యలతో విచియా గ్రామం అట్టుడికిపోయింది. అక్కడి ప్రజలు భయంతో వణికిపోయారు. ఎందుకంటే, వారికి తమ ప్రాంతంలో హత్యలు జరిగిన జ్ఞాపకాలే లేవు. హంతకుడిని పట్టుకోవాలని పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. అనుమానితుల్ని అరెస్టు చేశారు. కానీ ఎటువంటి ఆధారాలు దొరకకపోవటంతో వదిలేశారు. పోలీసులకు దొరికిన ఏకైక ఆధారం హంతకుడి స్పెర్మ్. కానీ, లైంగికంగా వేధించాలని అతడు ప్రయత్నించిన ఆధారాలు లేకపోవటంతో, హత్య చేస్తూ అతడు తీవ్రమైన లైంగికానందాన్ని పొంది ఉంటాడని పోలీసులు భావించారు. అయితే, ఆ కాలంలో 'డిఎన్ఎ' గుర్తింపు పద్ధతి అభివృద్ధి కాకపోవడంతో వాళ్లకు అది ఉపయోగపడలేదు.

ఓటెరో హత్యలు జరిగిన మూడు నెలల తరువాత మళ్లీ హత్య జరిగింది. హత్యలు చేస్తూ లైంగికానందం పొందే వ్యక్తి మళ్లీ మళ్లీ హత్యలు చేస్తాడన్న పోలీసుల ఊహ సరైనదేనని తేలింది. 21 ఏళ్ల కాథరిన్ బ్రైట్ అనే అమ్మాయి హత్య జరిగింది.



'బిటికె' సీరియల్ కిల్లర్ డెన్నిస్ 'రేడర్'

ఈసారి పోలీసులకు ఎటువంటి ఆధారాలు లభించలేదు.

అయితే, హంతకుడు పోలీసులకు ఉత్తరం రాశాడు. తన పేరు 'బిటికె' (BTK) అన్నాడు. అంటే బంధించు (bind), హింసించు (torture), చంపు (kill) అని అర్థం... అని ఆ ఉత్తరంలో రాశాడు. మనుషులనిలా చంపటం తనకు బాధ కలిగిస్తుంది. కానీ, తన మెదడులో ఓ మనిషి ఉన్నాడనీ, ఇలా చంపటం అతడికి సంతృప్తినిస్తుందనీ, అందుకే తనకు ఇష్టం లేకున్నా తానీ హత్యలు చేస్తున్నాడనీ ఆ ఉత్తరంలో రాశాడు. తానే నిజమైన హంతకుడు అని పోలీసులను నమ్మించేందుకు 'ఓటెరో' హత్యలను విపులంగా వర్ణించాడు. పోలీసులు బహిర్గత పరచని ఆధారాల గురించి కూడా ప్రస్తావించాడు.

దాంతో ఆ ఉత్తరం రాసింది హంతకుడేనని పోలీసులకు నిర్ధారణ అయింది. కానీ ఉత్తరం ఆధారంగా హంతకుడిని పట్టుకునే వీలులేదు. ఆ తరువాత వెంట వెంటనే హత్యలు జరగటం మొదలయింది. హత్య జరిగిన తరువాత ఆ హత్య ఎలా చేశాడో వివరిస్తూ, ఆ సమయంలో హంతకుడు అనుభవించిన ఆనందాన్ని వర్ణిస్తూ ఉత్తరాలు రాసాగాయి.

1977లో హిర్లేన్‌ను హత్య చేశాడు.



హతులలో కొందరు

అదే సంవత్సరం డిసెంబర్‌లో 25 ఏళ్ల నాన్సీని హత్యచేశాడు. తరువాత మరో అయిదుగురిని చంపేశాడు. అంతటితో ఆగలేదు. తన హత్యలను కవితల రూపంలో రచించి రేడియోకు, టీవీలకు పంపటం ఆరంభించాడు. ఈ వరుస హత్యలతో 'విచియా' అట్టుడికి పోయింది. మహిళలు భయభ్రాంతులయ్యారు. ఒంటరిగా బయట తిరగటం మానేశారు. ఇళ్లల్లోకి వెళ్లేటప్పుడుకూడా పరిసరాలన్నీ పరిశీలిస్తూ జాగ్రత్తగా వెళ్లేవారు. హంతకుడెవరో చిన్న ఆధారం కూడా పోలీసులకు దొరకలేదు. నెమ్మదిగా హత్యలు తగ్గిపోయాయి.

చివరికి ఆగిపోయాయి. జన జీవితం రొటీన్‌లో పడింది.

పోలీసులు మాత్రం పరిశోధనలు ఆపలేదు. 1980 దశాబ్దంలో 'డిఎన్ఎ' ఎనాలిసిస్ అభివృద్ధి చెందిన తరువాత ఓటెరో హత్య సమయంలో లభించిన స్మెర్స్‌ను డిఎన్ఎ పరీక్ష చేశారు. విచియాలో నేకాదు, దేశవ్యాప్తంగా పోలీసులవద్ద ఉన్న నేరస్తుల డిఎన్ఎతో పోల్చారు ఏమీ లాభం లేకుండా పోయింది. హంతకుడు పోలీసులకు ఉత్తరాలు రాయటం కూడా హత్యలతోపాటుగా తగ్గిపోయింది. అయితే, హంతకుడు మన మధ్యనే ఉన్నాడు. మళ్లీ ఎప్పుడో హఠాత్తుగా నిద్రలేస్తాడు. అంటూ ముగిసింది వ్యాసం...

ఓటెరో హత్యలు జరిగి 30 ఏళ్లయిన సందర్భంగా ప్రచురితమైన వ్యాసం విచియా ప్రజలకు మళ్లీ ఆ పాత భయానకపు రోజులు జ్ఞప్తికి తెచ్చాయి. అంతేకాదు, 25 ఏళ్ల మౌనం తరువాత మళ్లీ హంతకుడు పోలీసులకు ఉత్తరం రాశాడు!

* * *

పోలీసులు, మానసిక శాస్త్రవేత్తలతో అత్యవసరంగా సమావేశమయ్యారు. "హంతకుడు మానసికంగా స్థిమితం లేనివాడు. కానీ పిచ్చివాడిలా కనిపించడు. మన మధ్యనే ఉంటాడు, మామూలుగానే. గుర్తు పట్టటం కష్టం" అని తేల్చారు మానసిక శాస్త్రవేత్తలు.

వరుసగా, వారానికొకటి, నెలకొకటి చొప్పున హంతకుడి నుంచి ఉత్తరాలు అందుతూనే ఉన్నాయి. ఆ ఉత్తరాలలో రకరకాల పజిల్స్, సామెతలు, పొడుపు కథలు పొందుపరుస్తున్నాడు. వాటిద్వారా 'నన్ను పట్టుకోండి చూద్దాం!' అంటూ సవాళ్లు విసురుతున్నాడు.

పోలీసులకేమీ తోచటం లేదు. ఉత్తరాలద్వారా ఎటువంటి ఆధారాలు సేకరించలేకపోతున్నారు. ఫిబ్రవరి 16, 2005న ప్రాంతీయ టీవీ స్టేషన్‌కు హంతకుడు ఒక పార్సెల్ పంపాడు. దాన్లో ఓటెరోల హత్య సమయంలో ఎత్తుకెళ్లిన గొలుసు, గడియారాలతోసహా ఓ కంప్యూటర్ డిస్క్ కూడా ఉంది. వెంటనే కంప్యూటర్ నిపుణులు ఆ డిస్క్‌ను క్షుణ్ణంగా పరిశీలించటం ఆరంభించారు. ఆ డిస్క్‌లో 'డిలీట్' చేసిన ఫైళ్లను రికవర్ చేశారు. అందులోని ఫైళ్లు పార్క్ సిటీ దగ్గర ఉన్న క్రెస్ట్ లూథరన్ చర్చికి సంబంధించినవని నిర్ధారించారు.

మరోవైపు, పోలీసులు హంతకుడి వయసును అంచనా వేశారు. ఓటెరోని హత్య చేసినప్పుడు హంతకుడికి కనీసం 20 ఏళ్లున్నా, ఇప్పటికి అతడికి 50 ఏళ్లు దాటి ఉంటాయని అంచనా వేశారు.

వెంటనే పోలీసులు పార్క్ సిటీకి బయలుదేరారు.

* * *

తలుపు తెరిచి పోలీసులనుచూసి ఆశ్చర్యపోయాడు పాస్టర్ మైకెల్ క్లార్క్. పోలీసులు అతడిని ప్రశ్నించారు. పాస్టర్‌కు హత్యలకు సంబంధం లేదన్న నిర్ధారణకు వచ్చారు. ఇంతలో ఓ డిటెక్టివ్ -

"మీ చర్చిలో 50 ఏళ్లు దాటినవాళ్లు ఎవరైనా పని చేస్తున్నారా?" అని అడిగాడు పాస్టర్‌ని.

"అంతా యువకులే!... ఆ... మా చర్చికి అధ్యక్షుడిగా ఈ మధ్యనే డెన్నిస్ రాడార్ ఎన్నికయ్యాడు. అతనికి 59 ఏళ్లుంటాయి. ఇద్దరు పిల్లలు. ఉద్యోగాలు చేస్తున్నారు. చాలా మంచివాడు. క్రమశిక్షణతో ఉంటాడు" చెప్పాడు పాస్టర్.

"అంతేకాదు అతడు స్కౌట్ లీడరు, విచియా స్టేట్ యూనివర్సిటీలోనే చదివాడు" అన్నాడు.

పోలీసులు ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

* * *

డెన్నిస్ రాడార్ వివరాలు, ఎవరికీ అనుమానం రాకుండా సేకరించారు పోలీసులు. డెన్నిస్ రాడార్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేశాడు. రిటైరయిన తరువాత పెళ్లిచేసుకుని స్థిరపడ్డాడు. విచియా యూనివర్సిటీ నుంచి డిగ్రీ సంపాదించాడు. జనాభా లెక్కల సూపర్‌వైజర్‌గా పని చేశాడు. స్కౌట్ నాయకుడయ్యాడు. ఇప్పుడు చర్చి అధ్యక్షుడు.

పిల్లలుకూడా పెద్ద చదువులు చదివారు. మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. "ఇతడిని హంతకుడిగా అనుమానించటానికి ఏ ఆధారాలు లేవు" అన్నాడో పోలీసు అధికారి అతని వివరాలన్నీ చదివి.

"అందుకే ఇన్నాళ్లూ మనం అతడిని హంతకుడిగా అనుమానించలేదు" అన్నాడు డిటెక్టివ్.

"అందరూ గౌరవించే ఇతడిని అరెస్టు చేయాలంటే, తిరుగులేని ఆధారాలు సంపాదించాలి. అనుమానాలతో అరెస్టు చేయటానికి మనది నియంతృత్వం కాదు, ప్రజాస్వామ్యం" అన్నాడు అధికారి.

పోలీసులు రహస్యంగా డెన్నిస్ రాడార్ డాక్టర్‌తో సంప్రదింపులు జరిపారు. డెన్నిస్ డాక్టర్ దగ్గర పరీక్షకు వచ్చినప్పుడు అతడికి తెలియకుండా అతడి ఉమ్మును సేకరించారు. దాన్నుంచి డిఎన్ఎను వేరు చేశారు. ఓటెరో హత్యాస్థలంలో దొరికిన స్మెర్స్‌ను డిఎన్ఎతో పోల్చారు. డెన్నిస్ రాడార్ హంతకుడన్న విషయంలో ఎటువంటి అనుమానాలను మిగల్చలేదు డిఎన్ఎ పరీక్ష ఫలితం!

* * *

డెన్నిస్ రాడార్ హంతకుడని తెలిసిన 'విచియా' దిగ్భ్రాంతికి గురయింది. అతని భార్య మతిస్థిమితం కోల్పోయింది. పిల్లలు తమ ఆస్తులు అమ్మేసి ఊరు వదిలి వెళ్లిపోయారు.

మే 3, 2005న రాడార్ అరెస్ట్ అయ్యాడు. కోర్టులో నేరం ఒప్పుకున్నాడు. అతడికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది.

అతడి కేసు గురించి వ్యాఖ్యానిస్తూ జడ్జి -

"హంతకులు, నేరస్తులు అన్న విషయం ఎవరి ముఖం మీద రాసి వుండదు. మనిషికి దేవుడిచ్చిన వరం లోపలి జంతువు బయటకు కనబడక పోవటం. ఇన్నేళ్ల తరువాతయినా రాడార్‌లోని జంతువును మనం గుర్తించాం. కానీ ఇంకా ఇలా గుర్తించని, బయటపడని ఇంకెన్ని జంతువులు ఈ జనారణ్యంలో స్వేచ్ఛగా తిరుగుతున్నాయో?" అన్నాడు.

ఆదివారం క్విజ్ **సమాధానాలు**

1. లండన్ 2. చైనా 3. 4896 మంది
4. బెల్లం మార్కెట్
5. సోడార్ (సోనిక్ డిటెక్షన్ అండ్ రేంజింగ్)